# సత్యవేద సార సంగ్రహము

1871

(1946లో సి.ఎల్.ఎస్. మద్రాసు వారు ముద్రించినది)

## దైవ కుమార వర్ణనము

## క్రీస్తు పరతత్వము

ప్రథమ భాగము

1.సీ॥ ఆద్యంత రహిత నిత్యానందరూపంబు
నాద్యంతయుత దేహ మమరదాల్చె।
జీవాత్మపరమాత్మ భావానుభవ పార
మార్థతత్వము భూమి నవతరించె।
అంబరాదులకెల్ల నాటపట్టగు నాల
యంబు యోసేపు గేహముననిమిడె।
విశ్వంబులో నుండి వెలినుండి వెలుగుచుం
డెడివెల్గు మరియ పుత్రుడనబరగె॥

తే॥గీ॥ కార్య కారణముల కాదికారణంబు
చేతనాచేతనములకు జీవనంబు
సర్వలోకములకు సదాశ్రయము యేసు
క్రీస్తు పరతత్వమొకటియే కేవలంబు. కొలస్సై 1:17,2:9

2.సీ॥ గాలిని బుట్టించు ఘనదేవుడేసుమీ
బలుతుపానుబలంబు నిలిపినాడు ।
నేత్రముల్ బుట్టించు నిజదేవుడేసుమీ
పుట్టుగుడ్డికిచూపు బెట్టినాడు।
జలధినిబుట్టించు సర్వేవుడేసుమీ
దానిపొంగణగింప దగినవాడు।

జీవవర్గముల సృష్టించు దేవుడేసుమీ
చచ్చువారికి జీవమిచ్చినాడు, యోహాను 17:22

తే॥గీ॥ మూర్తి నరమూర్తి శుద్ధ సద్వర్తనంబు
కార్యములు దైవ కృతములై గానుపించు
క్రీస్తుదేవుడు దేవుడే క్రీస్తుగాక
నితరమిక లేదనుచు భక్తుదెరుగవలయు. ఫిలిప్పీ 2:6

3. గీ॥ యేసు క్రీస్తుమయము ఈ విశ్వమంతయు
విశ్వమయుడు క్రీస్తు వేరు లేదు
క్రీస్తుమయముగాని వస్తువు పరమాణు
వైన లేదుబుద్ధి నరసిచూడ. హెబ్రీ 1:3

4. గీ॥ విత్తులోననుండి వృక్షంబువృక్షమం
దుండి విత్తనంబు నొప్పురీతి
క్రీస్తులోననీ సమస్తజగంబుండు
జగములోన క్రీస్తు దగవెలుంగు యోహాను 1:5,10

5. మ॥ కృపయున్ సత్యము రెండు నేకముగ ధాత్రిన్ మానవాకారమై।
యుపమానోజ్జ్వల దివ్యబోధలు ప్రియం బొప్పార బోధించిపా ।
పపయోరాసి మునుంగుమర్త్యులను గావన్‌జీవ మర్పించిలే ।
చి పవిత్రోన్నతముక్తి పీఠమున నిల్చెన్ సచ్చిదానందుడై యోహాను 1:17

6. క॥ సాత్విక తేజోనిధియగు
తత్వము పరతత్వమై నిధానంబగు దే
వత్వము వహించె క్రీస్తుమ
హత్వమువర్ణింప నేరికైననువశమే.

7.గీ॥ ఆత్మయగు దేవునకు నరుండాత్మచేత
తెలుసుకొనిసేవగావింప వలయుననుచు
సద్గురుస్వామి క్రీస్తు నిస్సంశయముగ
నల సమెర్యావనితకిచ్చె నాత్మబోధ యోహాను 4:23,24

8. యేసుని మాటలలోన ని
వాసముగా జీవమాత్మ వర్తిలుచుండెన్
చేసినయద్భుతము లుప
న్యాసములుతదీయ వర్తనకుసాక్షిగదా యోహాను6:63

9.క॥ పరిశుద్ధాత్ముని నిలయము
నరభక్తుని దేహమనుచు వర్ణింపబడెన్
పరమాత్మ యున్నచోటను
పరమేశుడు క్రీస్తుడుండు బంధుత్వమునన్ 1 కొరింథీ 3:16,17, 1 పేతురు 2:5

10.క॥ జీవము సత్యము మార్గము
త్రైవిధములు దానయనుచు తత్వనిగూఢో
జ్జీవితవాక్యము బలికెను
దేవునియాత్మజుకు క్రీస్తు దేవుడెతలపన్ యోహాను 14:6

11.క॥ పశువులతొట్టిని పండెడు
శిశువే నిజదేవుడనుచు సేవింపను ప్రా
గ్దిశనుండి పండితులు వ
చ్చి శిరంబులు మోపిరతని శ్రీపదములకున్

12.క॥ పరిశుద్ధాత్మ నొసంగను
పరిపరివిధమైన దేశభాషలుబలుకన్
వరములొసగె శిష్యులకును
తిరముగ క్రీస్తుండనాది దేవుడు కాడే.

13.క॥ తనుపట్ట వచ్చువారికి
సునిసితమగు తేజమొకటి చూపించిన నే
లను బడిరివారు కేవల
మనుజుండతడైననిట్టి మహిమలుగలవే.

## జీవపరమాత్మల అన్యోన్యత

14.సీ॥ పరమాత్మకృతవస్తు బహుళంబు సమకూర్చి
జీవాత్మ వేరొక్క సృష్టిజేయు।
పరమాత్మవస్తువేర్పడజేయు జీవాత్మ
బహువస్తుమిళిత రూపంబొనర్చు।
పరమాత్మకృతము జీవరసంబుకొనసాగు
జీవాత్మకృతము నిర్జీవమగును।
పరమాత్మ సృష్టి సంభవకారణంబయ్యె
జీవాత్మకార్యవైచిత్రమయ్యె,

తే॥గీ॥ నిట్టిపరమాత్మజీవాత్మ లిరువురొక్క
రూపుగానుండుదురు తెల్విచూపరులకు
దేవుడే జీవుడగుచు పృథ్వినిమనుష్య
కాయముల క్రీస్తు నామాత్మగా వెలుంగు. యోహాను 1:4, ద్వితీ 30:2

## ఎఱుక * ఆత్మ, ఆత్మయే క్రీస్తు

15.క॥ ఎఱుకకన్న దైవ మీజగంబున లేదు
ఎఱుక సాటివస్తు వెద్దిలేదు
అట్టి యెఱుక నిర్మాలాత్మయై దేహి దే
హమున వెలుగుక్రీస్తు నాహ్వాయమున

16.సీ॥ ఎఱుక చేవిశ్వంబు నెఱుక జూచునుగాని
యెఱుక లేకున్న నెట్లెఱగదలచు।
నెఱుక చేబహువిద్య లెఱిగి నేర్చునుగాని
యెఱుకలేకున్న నేర్పెట్లుగలుగు।
నెఱుక చేకార్యంబు లెల్లజేయునుగాని
యెఱుక లేకున్న నే దెట్లు సేయు।
నెఱుకచే తన్నుదా నెఱుగజెప్పడుగాని
యెఱుకలేకున్న తన్నెఱుగుటెట్లు,
తే॥గీ॥ ఎఱుకలో సర్వలోకంబు లిమిడియుండు
సర్వలోకంబు లెఱుకచే సాగినడుఛు
నట్టియెఱుకాత్మ రూపమయ్యాత్మయేసు
క్రీస్తుక్రీస్తుండె బ్రహ్మంబు కేవలంబు.

17.గీ॥ ఎఱుక చేతమనుజ డెల్లసేతలుసేయు
ఎఱుక లేని యెడల నేమిలేదు
సర్వమునకుమూల సాధనం బెఱుక య
య్యెఱుక వెలుగునదియె యేసుక్రీస్తు సామె 8:17,22,35, యోహాను 17:3

ఎఱుక అనగా దేవుని జ్ఞానము, ఈపేరు క్రీస్తుకు కలిగియున్నది.

18.క॥ సర్వములో సర్వమునై
సర్వాతీతంబునగుచు సర్వజ్ఞతతో
సర్వాంతరాత్మదానై
సర్వేశ్వరుడగుచు క్రీస్తు సాక్షిగనుండున్ కొలస్సై 3:11

## అమనస్క మాన ముద్ర

19.సీ॥ తేజంబులెగసి నిస్తేజమై యొక మహా
తేజంబులోన నిద్రింపబోయె।
బలములుప్పొంగి దుర్బలములై యొకమహా
బలములో జేరి సుప్తంబునొందె।
జ్ఞానంబులెదిగి యజ్ఞానమై యొకమహా
జ్ఞానంబులో గ్రుంకి లీనమయ్యె।
విషయంబులడరి నిర్విషయమై యొకమహా
విషయంబులోజేరి విశ్రమించె,

తే॥గీ॥ నట్టిచతురార్థసంగ్రహం బనవరతస
మాధియానందమయము బ్రహ్మంబునిర్మ
లాత్మయదె క్రీస్తు క్రీస్తులో నైక్యసుఖము
గాంచు పరిశుద్ధజీవుడే క్రైస్తవుండు.

## బంధవిముక్తి

20.సీ। ఎచ్చోట ప్రభునాత్మ యింపుగావసియించు
నచ్చోటసంశయం బడగిపోవు।
సంశయాంధతమంబు సమసినయంతనే
కర్మబంధములు శీఘ్రమునవీడు।

కర్మబంధముల పగ్గములూడినంతనే
ముక్తిమార్గముగాంచి మోదమొందు।
ముక్తిమార్గమున సమ్మోదించి జనుచుండ
శుద్ధాత్మతో నైక్యసుఖముగాంచు,
తే॥గీ॥ నదియనెట్లన బుద్బుదంబుదధిలోన
నుదయమైకొంత సేపు వేరుండిపిదప
నమ్మహోబ్ధిని తద్రూపమైనయట్లు
క్రైస్తవుడు క్రీస్తురూపంబుగా వెలుంగు.

2 కొరింథి 3:17,18, 1 యోహాను 8:2, రోమే 8:29, 1 కొరింథీ 15:49

## యేసుని పోలికగానుండుట

21.చ॥ తలయును దేహమున్లతయు ద్రాక్షపుచెట్టును భార్యభర్త నిం।
పలరెండుతండ్రియున్ సుతుడహఃపతియుణ్ కిరణంబులున్ మహా।
జలధియు నేరులున్ గలసి సఖ్యతనైక్యత నుండురీతి ని।
ష్కలుషతనేకమై సుజన క్రైస్తవుడుండును క్రీస్తుపోలికన్

కొలస్సై 1:18, యోహాను 15:5, 2 కొరింథీ 11:2, 5:1

22.క॥ తనుదానెరింగి యేసుని
ఘనతత్త్వ రహస్యమెరిగి క్రమముగతధ్యా
ననిరూఢిగలుగువారికి
తనరూపముజేయు ప్రభువు తనవలెనుండన్.

23.క॥ పురుగొకటి తెచ్చి యళి తన
సరిరూపము జేయునటుల సదయత ప్రభువే
ర్పరచుకొనువారి తన సుం
దర తేజోరూపమొసగి తనవలెజేయున్.

యోహాను 15:4, కొలస్సై 3:4, కీర్తన 17:15

24.కు॥ హితమిది సమ్మతమిది వాం
ఛితమిది క్రైస్తవుడనుటకు చితమిదిసర్వో
న్నతశాశ్వత సౌఖ్యముతో
బ్రతుకిది యిది లేనివాని బ్రతుకొాక బ్రతుకే.

25.కు॥ శాంతస్వరూపియగు ప్రభు
చింతామృతపానమానసికినది యెంతో
సంతోష మొసగు దురిత
స్వాంతునికది లేమి దుఃఖసాగరమెగదా.

26.కు॥ అదిగావున క్రైస్తవుడా
మదిలోదలపోసిచూడు మాయావేషం
బు ధరించిన సుఖమేమిటి
హృదయములో ప్రభునివెదుకుమిది సుఖముసుమీ.

27.కు॥ గురుతరమగు నీపరత
త్వరహస్యము దెలియగోరు వరభక్తులకున్
చిరసౌఖ్య మొసగు తండ్రీ
పురుషోత్తమదాసపాల బుధనుతశీలా.

## క్రీస్తు పరతత్వము - ద్వితీయ భాగము
## విశ్వాసియొక్క సంపద

1.సీ॥ విశ్వాసపరునికి వెతజెందినపుడేసు
డాలుగామేలుగా మ్రోలనుండు।
విశ్వాసపరుని నన్వేషించుచును క్రీస్తు
జోడుగానీడగా తోడనుండు।

విశ్వాసపరుని నే వేళబాయక యేసు
కోటగాచాటుగా తోటియుండు।
విశ్వాసపరుని వెన్వెంటబోవుచు క్రీస్తు.
కొండగా దండిగా నండనుండు,
తే॥గీ॥ కోరితన దారిజనువారి నేరికైన
సారెకునుమారుకొనువై బారిబడుట
తారసిలజూచి తనవారి జేరిపోరి
భూరిజయమిచ్చు తానెంచువారికిలను.

2.సీ॥ శ్రమలెన్నియున్న విశ్వాసికినలతరం
గ సుఖంబునేప్రొద్దు గలిగియుండు।
ధనమేమిలేకపోయినను విశ్వాసికి
హృదయసంతోషంబు వదలకుండు।
తనలోని వైరుల దునుమువిశ్వాసికి
పగవాడొకడు గాన బడడుభువిని।
కృపపొందియున్న నిష్కపటవిశ్వాసికి
తక్కువేమియులేదు ధాత్రియందు,
తే॥గీ॥ నహహవిశ్వాసిభాగ్య మేమనగవచ్చు
ననుదినము దేవునిని తండ్రియనుచుబిలుచు
నరుడుగానట్టి దేవమానవుడుగురుడు
మనసుశుద్ధాత్మతో గూడి మార్పబడును.

3.క॥ నిజమగువిశ్వాసిని స
ర్వజనులుగొనియాడుదురు పరాక్రమమున ది
గ్విజయ మొనర్చుదురాజున
గజేయుడగునతడు భక్తియైశ్వర్యమునన్

4.గీ॥ అవనితొల్లిటి విశ్వాసులైనవారి
పేరులను పౌలు వ్రాసి చూపించియుండె
వారువీరాధివీరులై వసుధజేయు
కార్యములు క్రైస్తవుల కెంతో ధైర్యమిచ్చు.

5.క॥ కావున విశ్వాసపరుల
జీవమెపురుషార్థమైన జీవముగాదా
ఈ విధము లేని వారలు
జీవన్మృతులనుచుమరియు జెప్పబడుగదా.

**రెండు కొమ్మలు గల మ్రాను**

6.క॥ నమ్మకమపనమ్మకమను
కొమ్మలుగల వృక్షమొకటి కుంభినిమీదన్
గ్రమ్ముకొనియుండె నెల్లెడ
నమ్మది చెట్టునకుఫలము లవియెట్లన్నన్

7.గీ॥ అమృత ఫలములు నొకకొమ్మ యందుబొడము
మృతఫలములొక్క కొమ్మలో మిగులబుట్టి
ఫలరసములిరుధారలై బారుచుండు
మింటికొకటి యధోలోక మంటియొకటి.

8.క॥ అపనమ్మికగలవారలు
శపియింపగబడుదురంత్య సమయంబున దుః
ఖపుపలుగొరుకులతో నర
కపు వహ్నికిబోదు రెల్ల కాలమునుండన్.

9.క॥ విశ్వాసులు దీవెనతో
విశ్వేశ్వరుడైన క్రీస్తు వెలుగున నిత్యా
త్మైశ్వర్యమనుభవింపుచు
శాశ్వతముండుదురు మోక్ష సదనమునందున్.

## సారూప్య పదవి

10.సీ॥ తలతోశరీరంబు తండ్రితోతనయుండు
ద్రాక్షవల్లినితీగె దనరినట్లు!
ప్రాణేశుతోపత్ని రాజుతో ప్రజయును
వృక్షంబుతోకొమ్మ పెరిగినట్లు!
కాపరితోగెట్టె కారణ గురువుతో
శిష్యుండు తల్లితో చిన్నబిడ్డ!
సంద్రంబుతో నేరు సదనంబుతో ద్వార
మాదిత్యుతోరస్మి యమరినట్లు,
తే॥గీ॥ క్రీస్తుతో భక్తుడటుల నేకీభవించి
మర్త్యమునకందరాని యమర్త్యమహిమ
రూపముధరించి విమల సారూప్యపదవి
నొంది వెలుగొందు శాశ్వతానందుడగుచు.

11.మ॥కో॥ ఎవరునేరము మోపజాలుదు రెంచబడు క్రైస్తవులపై
దివినివారిని నీతిపరులని తీర్పుచేసెను దేవుడే
యెవరు శిక్షవిధింపజాలుదు రేసునంటిన దాసులన్
భువినివారి నిమిత్తమే మృతిబొందిలేచెను క్రీస్తుడే.

## ఉత్సాహము

12. ఉ॥ మిన్నులన్ని దాటిపోయి మీదనుండు క్రీస్తుడ
త్యున్నతోన్నతుండునయ్య నుర్వినుండుసర్వదా
తన్నుగొల్చువారితోను తానుజెప్పువాక్యమే
నన్ని కాలములను మిమ్ము నంటివెంటనుండెదన్ మత్తయి 20:20

13.కII ఈ వాగ్దత్తము చేసిన
దేవుండగు క్రీస్తు నన్ను దినదినమును నా
త్రోవలచుట్టుండియు నను
గావుననుచు నమ్మవలయు క్రైస్తవుడెపుడున్.

14.కII గురుడన్నను రాజన్నను
మరియాజకుడన్న దేవ మానవుడన్నన్
నెరి క్రీస్తుని కవి చెల్లును
పెరవారలకిట్టి పేరు పెంపులు గలవే.

## విరోధ భంజనము

పంచచామరము

15. పరీక్ష చేయలేక క్రీస్తు భక్తిమర్మమాత్మలో
నెరుంగలేక వైరము న్వహించి పేరు క్రీస్తులా
చరించు దుష్ క్రియల్ దలంచి సాకుబెట్టి యేసునిం
దిరస్కరించువారలెల్ల దిక్కులందు లేచిరే.

**తోటకవృత్తము**

16. అపరాధులరక్షణకై సిలువన్
కృపతో మృతిబొందెను క్రీస్తుడిలన్
ఉపకారమెరుంగక నూరకనే
యవహాసములాడుదు రల్పమతుల్.

17.కII ఖద్యోత సమాజంబులు
ప్రద్యోతుని తేజమణప పరువిడుభంగిన్
ఉద్యోగింతురు కుజనులు
విద్యాసారమగు క్రీస్తు వేదంబణచన్

18.కII చీమలు పదికోట్లైనను
జీమూతముబోర్లగింప జేయంగలవే
సామాన్యుల విశ్వాసులు
క్షేమంబగు క్రీస్తుమతము చెరుపంగలరే.

19.కII అదిగావున భక్తుడు త
న్నెదింరించినవారికెల్ల నేమాత్రంబున్
బెదరక చెదరక కుదురుగ
మృదువుగ బోధించుచుండు క్రీస్తుసువార్తన్.

20.కII తనసిలువనెత్తుకొని ప్రభు
వెనుకనుజనుచుండునట్టి విశ్వాసుని కెం
దున భయములేదు కార్యము
ఘనతరముగజేయు సిద్ధి గనునటమీదన్

## హృదయౌషధము

21.కII గాలిని దీపము నిలువని
పోలిక సంసారవిషయముల దగులుచు కా
ల్గాలిన మార్జాలమువలె
తాలిమిచెడిదిరుగుమనసు తత్వమెరుగకన్

22.గీII అందుకొకమందు గలదెట్లనిన క్రీస్తు
పాదములునమ్మి శుద్ధాత్మ బడయగోరి
జేరినిత్యంబు ప్రార్థనల్ సేయు నేని
దైవ కరుణాసహాయమె దానిమందు.

23.కII దేవునికృప కన్నునుమరి
యేవిధమగుమందు లేదు హృదయమునిలుపన్
జీవముగల క్రైస్తవుడా
నీవాకృపననుసరించి నిలుమిందందున్.

**క్రీస్తుదేవుని ప్రతిబింబము**

24. గీII తరణిరూపంబు నిర్మలోదకములందు
ప్రతిఫలించిన రెండు బింబంబులయ్యె
ఘటజలోపాధిద్రోయ నొక్కటియకాదె
దేవుడేక్రీస్తుడనియిట్లు దెలియవలయు.

25.కII అద్దము తన యెదుటను నిడ
నిద్దరుగాదోచురూప మిరువురదొకటే
యద్దము బద్దలుగొట్టిన
యిద్దరుమరిలేరు యొక్కటే గానబడున్

26.కII యేసుని దేహూపాధియ
దేసుమియూదులకు నితర దేశస్థులకున్
జేసెను భేదము దేహ
భ్యాసులకా ప్రభునియాత్మ బలమగుపడునె

27.గీII తనయుడైపుట్టునట తండ్రి ధాత్రియందు
ఆత్మవైపుత్రనామాసి యనెడువాక్య
మదినిజంబేని క్రీస్తు దేవాత్మజుండు
దేవుడేక్రీస్తుడనగ సందియమికేల.

28.గీ॥ ఆత్మతోనాత్మను స్మరించునట్టివాడు
యేసుప్రభువెవ్వడో యని యెరుగగలడు
అతడు దేవాత్మజుడు పరమాత్ముడైన
క్రీస్తు పరతత్వమేయని ప్రస్తుతించు.

## నూతన జీవము

29.గీ॥ నేను క్రీస్తునితో సిలువ ప్రానిపైని
వేయబడితిని యికను జీవించుచున్న
వాడనేగాను బ్రతుకుచున్నాడు క్రీస్తు
డిపుడు నాయందనుచు పౌలుడిట్లువ్రాసే. గలతీ 2:20

30.క॥ అటులైన క్రైస్తవుడు మును
పటివాడునుగాడు క్రొత్తవాడైనతనలో
పటవెలుగు నతనిగనియు
త్కటమగు సంతోషమొంది తనుదానెరుగున్.

31.గీ॥ క్రొత్తజీవంబు శిష్యుని చిత్తమందు
నుదయమగునేని జీవించుచుండు క్రీస్తు
డదియె శుద్ధాత్ముడదియె నిత్యప్రమోద
మదియె తనుదానెరుగు తత్వమదియెముక్తి

32.క॥ క్రీస్తు పరతత్వమెరిగెడి
క్రైస్తవుడే క్రైస్తవుండు గావుననిపుడే
క్రైస్తవులారా మనమీ
ప్రస్తుతలోకమున నతనివలె నుండవలెన్.

33. క॥ ధరకటకపురీవరమున
నెరినీకృపబొందియుండు నీసేవకుడా
పురుషోత్తమ విరచితమిది
తిరముగనీజనులకొసగి దీవించు ప్రభో.